# సెల్ఫ్ ఫ్రాడ్

"ఎస్ ... ఫోర్త్‌టౌన్ క్రైం ఎస్సై ఇంద్రజిత్ స్పీకింగ్ ... ఆ ... చెప్పండి"

"ఏమిటి? అగ్నిప్రమాదమా?... ఎక్కడ?" బజారా ... ఏ బజారు?

"చిరునామా చెప్పండి?" టేబిల్ మీదవున్న ప్యాడ్‌ను ముందుకు లాక్కుంటూ అన్నాడు ఇంద్రజిత్.

అవతల్నుంచి ఆ వ్యక్తి గాభరాగా చిరునామా చెప్పి ఫోన్ పెట్టేసేడు. ఇంద్రజిత్ ఆ ఫోన్‌కాల్ ఎక్కణ్ణించి వచ్చిందీ ఎక్ఛేంజికి ఫోన్‌చేసి కనుక్కున్నాడు. ఫలితం మాత్రం లేదు. వెంటనే మెన్‌ని సిద్ధంచేసి జీప్‌లో బయల్దేరేడు —

బజారు వీధి — జనంతో రద్దీగా ఉంది. వీధి ముందు ఫైర్ లారీలు ఆగివున్నాయ్. ఆ వీధి చివరవున్న షాపు ముందు ఫైర్‌మెన్‌లు మంటల్ను ఆర్పుతున్నారు. మంటలు ఆరిపోయినా పొగలు సన్నగ వస్తోన్నాయ్.

పోలీస్ జీపు వచ్చి ఆ షాప్ ముందాగింది. జీప్ వెనకభాగంలోంచి పోలీస్‌లు బయటకు వచ్చేరు. షాపుముందున్న జనాన్ని దూరంగా పంపేరు. ఇన్‌స్పెక్టర్ ఇంద్రజిత్ అతని వెనక సార్జెంట్ సారంగరాజు జీప్ దిగేరు. ఇంద్రజిత్ సిబ్బందికి చకచకా సూచనలు ఇచ్చేడు. ఒక్కసారి షాపువేపు వేగంగా వెళ్ళేడు. ఆ షాపు ఫాన్సీ అండ్ స్టేషనరీ షాపు. గుమ్మం ముందువున్న ఐరన్ షట్టర్ సగం దిగివుంది. ఆ సందులోంచి పొగలు సన్నగా వస్తున్నాయ్. షట్టర్ మసిపట్టి ఉంది. ఇంద్రజిత్ వేలిముద్రల నిపుణుణ్ణి పిల్చి వెంటనే షట్టర్ మీదున్న వేలిముద్రల్ను తనిఖీ చెయ్యమన్నాడు. అతను వెంటనే పని ప్రారంభించేడు.

"సార్ ... ఈ షట్టర్. మీద రెండు జతల వేలిముద్రలున్నాయ్" అన్నాడు వేదవ్యాస్.

"ఓకే ..." అని ఫోటోగ్రాఫర్ వద్దకు వెళ్ళేడు ఇంద్రజిత్. అతనికి సూచన్లు ఇచ్చేడు. ఫోటోగ్రాఫర్ ఫోటోల్ను వేగంగా తన కెమేరాతో తీసేడు. అంతా షాపులోకి వెళ్ళేరు. షాపులో ఉన్న ఫర్నీచర్ సగం కాలిపోయి బూడిదైంది. ఆ షాపుకు ఆనుకుని మరే గది లేదు. గది మూల మాడిపోయి పడివున్నాడో వ్యక్తి. ఆ వ్యక్తి వద్దకు వెళ్ళేడు. శవం వేపు చూసేడు. ఆ వ్యక్తి శరీరం అంతా కాలిపోయింది. మొహం వికృతంగా ఉంది. అతని ప్రాణంపోయి ఆరుగంటలై ఉంటుందని అతననుకున్నాడు. షాపువంతా క్షుణ్ణంగా పరిశీలించేడు, ఎలెక్ట్రిక్ వైర్లు వేపు చూసేడు. వైర్లు కాలిపోయేయ్. వస్తువులూ కాలిపోయేయ్. గదినంతా మరోసారి చూసేడు. అతనికి ఏ ఆధారం దొరకలేదు. ఆలోచనలో పడ్డాడు. ఫోటోగ్రాఫర్ వేలిముద్రల నిపుణుడు వారి వారి పన్లు చేస్తున్నారు. అంతలో పోలీస్ సర్జన్ మాధవన్ అక్కడకు వచ్చేడు. ఇంద్రజిత్‌కు విష్ చేసేడు. శవాన్ని పరిక్షించేడు. శవం శరీరంపైన ఏమైనా గాయాలున్నాయో? లేదో చూసేడు. ఇంద్రజిత్ వేపు చూసి పెదవ్విరిచేడు.

"ఏం? డాక్టర్? ఏమైనా తెల్సిందా?"

"మీకు ఇప్పుడు ఏం చెప్పలేను ... తర్వాత రిపోర్ట్‌లో వివరిస్తాను". శవం పక్కనుంచి కదుల్తూ అన్నాడు మాధవన్.

మాధవన్ పోలీస్ సర్జన్‌గా 30 ఏళ్ళ అనుభవం ఉంది. ఆయన ఏ విషయం, క్షుణ్ణంగా పరిశీలిస్తేగాని చెప్పడు. అతను చెప్పిందాంట్లో అసత్యం ఉండదు. అందుకే ఆయన్నూ ఆయన రిపోర్ట్‌ను అందరూ గౌరవిస్తారు.

"అలాగే సార్ ..." అని శవాన్ని పోస్ట్‌మార్టంకు పంపి, మరోసారి గదిని పరిశీలించేడు. శవం పడివున్న ప్రదేశానికి కాస్త దూరంలో కొన్ని వస్తువులున్నాయ్. ఆ వస్తువులు సగం కాలి ఉన్నాయ్. ఆ వస్తువులు బొమ్మలు, టోయ్ కార్లు, ఆ వస్తువుల్ను పరిక్షించేడు. గోడకున్న షోకేసులు లేపిచూసేడు. షోకేసులో అరలు ఖాళీగా ఉన్నాయ్. గదిలో మరో మూల ఒక పెద్ద రేకుడొక్కు ఉంది. అటువేపు వెళ్ళేడు. రేకుడొక్కు మూత తెరిచేడు. అందులో ఉన్న పుస్తకాలను బయటకు తీసేడు. అవి స్టాక్ రికార్డ్, బిల్ పుస్తకాలు, ఒక తెల్ల కవరు ఉన్నాయ్. బిల్ పుస్తకాల్లో ఒక పుస్తకం తెరిచేడు. పేజీలు తిరగేసేడు. ఖాళీగా ఉన్నాయ్. మరోపుస్తకం తీసి తెరిచేడు.

శ్రీరాం ... ఫాన్సీ అండ్ స్టేషనరీ షాపు
షాపు నెం.42
ప్రొ. టి.రంగారావు

అని ఉంది. ఇంద్రజిత్ తల పంకించేడు. సో ... హతుడి పేరు రంగారావు అన్నమాట. చిగురు దొరకడానికి ... ఆధారం మొదలు దొరికింది. పేజీలు వేగంగా తిప్పేడు. ఏ సమాచారం అందులో లేదు. చివరగా తెల్లకవరు విప్పేడు. ఖాళీ .. కవర్ మీద ఉన్న అడ్రస్సు చూసేడు. అది రంగారావు షాపు అడ్రస్సే ... కవరు దిగువ ఎడమవేపు చూసేడు. చిన్న అక్షరాల్తో ఫ్రమ్ అడ్రస్ ఉంది.

"ది ఇండియా జనరల్ అండ్ ఫైర్ ఇన్సూరన్స్ లిమిటెడ్
డాబా తోట ... విశాఖ—4

అని ఉంది. ఆ కవర్ను జేబులో ఉంచుకుని డబ్బా లోపల మరేది లేదు. వెనక్కి తిరగబోతూ ఠక్కున ఆగేడు. రేకుడొక్కు వెనక ఏదో వస్తువు అతనికి కనిపించింది. వంగుని ఆ వస్తువును రుమాల్తో తీసేడు. ఆ వస్తువు రేకు డబ్బా ... వాసన చూసేడు. అతని కళ్ళు మెరిసేయ్. సార్జెంట్‌కు ఆ డబ్బాయిచ్చి ఏదో చెప్పి పంపేడు.

"ఫోర్ నాట్ త్రీ"

"సార్ ..."

"నువ్వు ... ఈ బజారులో ఉన్న షాపువాళ్లని ఎంక్వైరీ చెయ్యి. ఈ షాపులో ఎందరు పనివాళ్ళున్నారో? వాళ్ల అడ్రస్సులు కనుక్కో ... వాళ్లని స్టేషన్‌కు తీసుకురా ... అర్జెంట్" అన్నాడు ఇంద్రజిత్.

ఫోర్ నాట్ త్రీ బయటకు వెళ్లిపోయేడు. ఇంద్రజిత్ షాపు బయటకు వచ్చేరు. అతన్ని సైనికుల్లా చుట్టుముట్టేరు పత్రికా విలేకర్లు.

"సార్ ... ఇది ప్రమాదమా ... లేక హత్యా?" ఆత్మహత్యా! లేక శత్రువులు పన్నిన పన్నాగమా?"

"సారీ ఫ్రెండ్స్ ... కేసు పరిశోధన పూర్తి అవలేదు. అయ్యేక మీకు వివరాలు వివరిస్తాను ... సీయూ ఎగైన్ ..." అని జీప్‌ను ఎక్కేడు ఇంద్రజిత్



హతుడు హత్యకు లోనవలేదు
శరీరంపై ఎటువంటి గాయాలు లేవు
మరణానికి ముందు అతను విపరీతంగా విస్కీ
సేవించాడు

హతుడు ... హత్యకు లోనవలేదు. శరీరంపై ఎటువంటి గాయాలు లేవు. మరణానికి ముందు అతను విపరీతంగా విస్కీ సేవించేడు. కడుపులో (చిన్న ప్రేగులో మాంసం ముక్కలు చికెన్ ఉన్నాయ్. ఇతరమైన పదార్థాలు లేవు) ఇతను అగ్ని ప్రమాదం వల్లే మరణించేడు ... అని ధృవీకరిస్తున్నాను.

సం.


డా. వై.ఎ.మాధవన్, ఎం.ఎస్.,

డాక్టర్ రిపోర్ట్‌ను మడిచి బల్లసొరుగులో పెట్టి గంట క్రితం జరిగిన సంఘటన జ్ఞాపకం తెచ్చుకున్నాడు.

"నా పేరు ఇంద్రజిత్ ... ఇన్‌స్పెక్టర్ ఆఫ్ క్రైమ్స్" అన్నాడు ఇంద్రజిత్.

"కూర్చోండి ... నా పేరు శాస్త్రి ... ఈ జనరల్ అండ్ ఫైర్ ఇన్స్యూరెన్స్ లిమిటెడ్‌కి బ్రాంచ్ మేనేజర్‌ని" అన్నాడు శాస్త్రి ఇంద్రజిత్‌కు కరచాలనం చేస్తూ.

ఇంద్రజిత్ కుర్చీలో కూర్చుని జేబులోంచి కవరుతీసి అతనికి అందించేడు. ఆ కవర్ను చూసేడు శాస్త్రి.




"ఈ కవరు ... మీకెలా వచ్చింది?" ప్రశ్నించేడు శాస్త్రి. అతనికి విషయం చెప్పేడు ఇంద్రజిత్. విని ఆశ్చర్యపోయేడు.

"సార్! రంగారావు మీ కంపెనీకి ఎంతకాలం నుంచి ప్రీమియం (డబ్బు) కడుతున్నాడు? అతను షాపును ఎంతకి ఇన్స్యూర్ చేసేడు? వివరాలు చెప్పండి?"

"వో ... అలాగే ..." అని కాలింగ్‌బెల్ నొక్కేడు శాస్త్రి. గది బయటవున్న ప్యూన్ శాస్త్రి ముందు ప్రత్యక్షమయ్యేడు.

"కరీమ్ ... ఈయన్ని స్వామిగారి వద్దకు తీసుకెళ్ళు"

ప్యూన్ బయటకు వెళ్ళేడు. ఇంద్రజిత్ ప్యూన్ వెనక వెళ్ళేడు. ప్యూన్ పక్కనున్న హోలులోకి తీసుకెళ్ళేడు. స్వామిని పరిచయం చేసేడు ప్యూన్. ఇంద్రజిత్ తను ఎందుకొచ్చిందీ చెప్పేడు. స్వామి రేక్‌లో ఉన్న ఒక ఫైలు బయటకు లాగి వేగంగా పేజీలు తిప్పేడు. ఒక పేజీ దగ్గర పేపర్ ముక్క వుంచి ఫైల్ను ఇంద్రజిత్‌కు అందించేడు. ఫైలులో ఉన్న వివరాలు చూసేడు — గబగబా చదివేడు. ఆ ఫైల్‌లో రంగారావు తన షాపును లక్ష రూపాయలకు 'జనరల్ ఫైర్ ఏక్సిడెంట్స్' కింద ఇన్స్యూర్ చేసినట్లుగా ఒక బాండ్ రాసి వుంది. మొదట ప్రీమియం ఆరువేల రూపాయలు కట్టినట్టు రసీదు కాపీ ఉంది. బాండ్ పేపర్ కింద ఎడంవేపు సాక్షి సంతకం "ప్రకాష్‌చంద్ర" అని ఉంది. బాండ్ రాసిన తేదీ 10–11–86.

ఇంద్రజిత్ సంతృప్తిగా ఫైల్ను అందిస్తూ తల వూపి 'థాంక్యూసార్' అని శాస్త్రి గదిలోకి వెళ్ళేడు.

"సార్ ... మీరు మీ బ్రాంచ్ అన్నింటికీ అర్జెంటుగా ఒక మెసేజ్ పంపాలి. ఆ మెసేజ్ నుంచి వచ్చే సమాచారం వెంటనే నాకు చెప్పాలి. ఆ సమాచారం వల్ల నా పరిశోధన ముందుకు సాగుతుంది" అని వేగంగా అతను ఏం చేయాలో కాగితం మీద రాసి అందించేడు.

"ష్యూర్ ... ష్యూర్ ... అలాగే చేస్తాను. రిప్లై రాగానే మీకు ఫోన్ చేస్తా" అన్నాడు శాస్త్రి

"సార్..."

తల ఎత్తిచూసేడు ఇంద్రజిత్. ఎదురుగా ఫోర్ నాట్ త్రీ. నిల్చున్నాడు అతని వెనక వైపు 20 ఏళ్ల వ్యక్తి నిల్చుని ఉన్నాడు. అతని వేపు చూసేడు అతడి తల చెదిరి ఉంది. కళ్ళు ఎర్రగా ఉన్నాయ్. చేతులు వెనక్కి పెట్టుకుని ఇంద్రజిత్ వేపు భయంగా చూస్తున్నాడు.

"ఫోర్ నాట్ త్రీ — రంగారావు షాపులో వర్కర్లు ఎవరూ లేరా? ఈ వ్యక్తి ఎవరు?"

"సార్ — ఆ బజారులో ఉన్న షాపులన్నిటిలో ఎంక్వైరీ చేసేను. రంగారావు షాపులో ఎవరూ నెల రోజులు దాటి పనిచేయలేదట సార్ —"

"ఎందువల్ల?"

"అతను వర్కర్లకు జీతాలు ఇవ్వడట ... అందుకనీ ఎవరూ అక్కడ పనిచేయరట. ఈ ప్రకాష్ ఒక్కడే రంగారావు వద్ద ఉన్నాడని ఇద్దరు చెప్పేరు. నేను ఈతని అడ్రస్సు కనుక్కుని వెళ్లేను. ఆ సమయానికి ప్రకాష్ బయటకెళ్తున్నాడు. నేను పట్టుకుని వచ్చేను సార్"

"వెరీగుడ్ —'నువ్వు వెళ్లి వేలిముద్రల నిపుణుణ్ణి రమ్మని చెప్పు" శ్రీ నాట్ శ్రీ బయటకు వెళ్లిపోయేడు.

"నీ పేరు ప్రకాష్ చంద్ర. ఔనా?"

తుళ్లిపడ్డాడు ప్రకాష్‌చంద్ర.

"నీ విషయం అంతా ఇన్సూరన్స్ మేనేజర్ నాకు చెప్పేడు. డబ్బుకోసం రంగారావును నువ్వు హత్యచేసేవ్ .. షాపులో, ఆ నేరం కప్పిపుచ్చాలని అతనిమీద పెట్రోలు పోసి అంటించేవ్. ఆ రంగారావుతోపాటు షాపూ కాలిపోయింది. అంతా అగ్నిప్రమాదం అనుకున్నారు. రంగారావు షాపుకు లక్ష రూపాయలు ఇన్సూరన్స్ చేసేడు. ఆ సమయంలో నువ్వు సాక్షి సంతకం చేసేవ్. ఒకవేళ షాపు అగ్నిప్రమాదం అయితే ఆ ఇన్సూరెన్స్ సొమ్ము ఆయనకు గాని నీకు గాని ఇమ్మనమని రంగారావు బాండ్‌లో రాసేడు. ఆయన ఇన్సూర్ చేసి ఆరునెలలు అయింది. ఆ లక్ష రూపాయలు కోసం నువ్వు రంగారావుని హత్యచేసేవు. ఏం ...?" అని కుర్చీలోంచి లేచి ప్రకాష్‌చంద్ర వద్దకు వెళ్లేడు. అతడి కళ్లలోకి సూటిగా చూసేడు.

"నో ... నో" అరిచేడు ప్రకాష్‌చంద్ర.

"నువ్వు నిజం ఒప్పుకో" గద్దించేడు ఇంద్రజిత్.

"సార్ ... నేను రంగారావుని హత్యచేయలేదు .. ఆయనే ప్రమాదానికి గురిఅయ్యేరు. మరణించేరు. నిజం సార్" భయంగా అన్నాడు ప్రకాష్‌చంద్ర.

అంతలో ఫోన్ మోగింది

ఇంద్రజిత్ రిసీవర్ ఎత్తేడు

"ఆ ... నేనే ... చెప్పండి. అంటే ఇన్నాళ్ళూ రంగారావు మిమ్మల్ని ... అదే ... మీ కంపెనీని మోసం చేస్తూ వచ్చేడన్నమాట. మీరు అర్జెంటుగా స్టేషన్‌కి రండి. రంగారావు తోడుదొంగ ప్రకాష్‌చంద్ర మా వద్ద ఉన్నాడు" రిసీవర్ రెస్ట్‌మీదుంచేడు ఇంద్రజిత్. వెంటనే ప్రకాష్‌చంద్ర వద్దకు వెళ్లి అతని అరచేతుల్ని పట్టుకున్నాడు. గింజుకున్నాడు ప్రకాష్‌చంద్ర. ప్రకాష్‌చంద్ర అరచేతులకు బేండేజ్ కట్టి ఉన్నాయ్. గమనించేడు ఇంద్రజిత్.

"ఏమిటీ నాటకం?" అరిచేడు ఇంద్రజిత్.

"నా చేతులు కాలేయ్. మందేసి కట్టుకట్టించుకున్నాను" బెదురుతూ అన్నాడు ప్రకాష్‌చంద్ర.

అప్పుడే లోపలికొచ్చేడు వేలిముద్రల నిపుణుడు వేదవ్యాస్.

"వేదవ్యాస్ ... ఈతని వేలిముద్రలు తీసుకో. వెంటనే రిపోర్ట్ ఇయ్యి". వేదవ్యాస్ తన పని మొదలు పెట్టేడు. ప్రకాష్‌చంద్ర కట్లు విప్పేడు ... అతడి అరచేతులు వేళ్ళు కొంత కాలివున్నాయ్. అతడి వేలిముద్రలు తీసుకొని తన గదిలోకి వెళ్లిపోయేడు వేదవ్యాస్. అతడు వెళ్లిన తర్వాత ఇన్సూరెన్స్ బ్రాంచ్ మేనేజర్ శాస్త్రి వచ్చేడు. ప్రకాష్‌చంద్రని చూసేడు.

"సార్ ... ఈయనే ... ఆ రోజు రంగారావుతో వచ్చేడు. ఈయనే రెండవ నామినీ" అరిచేడు శాస్త్రి.

"వూ ... నిజం చెప్పు, లేదా నువ్వు ఎలా చెప్తావో ఆ పద్ధతిని మేం ప్రయోగిస్తాం"

ప్రకాష్‌చంద్ర కొద్ది క్షణాలు ఆలోచించేడు. తలవూపేడు.

"సార్ ... మీరు నన్ను కనికరించాలి ... జరిగిన విషయం చెప్తాను. నేనూ రంగారావు బావా మరుదులం. ప్రతీవూళ్లో ఇద్దరం రకరకాల వ్యాపారాలు చేసేవాళ్లం. ఇన్సూరెన్స్ చేసి ... ఆ కంపెనీ వాళ్లని మోసంచేసి డబ్బు చాలా సంపాదించేం ... ఈ వూరు వచ్చేం ... ఏడాదికిందట రంగారావు ఫేన్సీ అండ్ స్టేషనరీ షాపు పెట్టేడు. వ్యాపారం ప్రారంభించేక షాపుకు రెండు లక్షలకు ఇన్సూరెన్స్ చేయించేడు. మొదట ప్రీమియం కట్టేడు. తర్వాత పనివాళ్లను తీసివేసేడు. చివరకు మేమిద్దరమే వ్యాపారం చేసేవాళ్లం. నిన్నరాత్రి తొమ్మిదింటికి బయట్నుంచి పెట్రోలు టిన్నుతో రంగారావు షాపులోకి వచ్చేడు. ఎందుకని అడిగేను. తను చేయబోయే పని చెప్పేడు.

"రంగా ... మనం చాలా చోట్ల ఇన్సూరెన్స్ వాళ్లని మోసంచేసి సొమ్ము దోచుకున్నాం. మనం చేసే మోసం కలకాలం సాగదు ...వద్దు" అన్నాను. నా మాట రంగారావు విన్లేదు. అతని వెనక ఉండమన్నాడు. ఆ పని పూర్తిఅయితే ఏభైవేలు వాటా ఇస్తాను ... అన్నాడు. నేను రాబోయే సొమ్ముకు ఆశించి మౌనం వహించేను. అర్ధరాత్రి వరకు వూళ్లో తిరిగి షాపుకు చేరుకున్నాం. నన్ను షాపు బయట కాపలా ఉండమని చెప్పి రంగారావు షాపు షట్టర్ సగం ఎత్తి లోపలకు వెళ్లేడు. పావుగంట తర్వాత షాపు లోపల్నుంచి మంటలు బాగా వ్యాపించేయ్.

"పరేయ్ ... రారా ... రక్షించు ... మంటలు" లోపల్నుంచి రంగారావు గొంతు చించుకుని అరుస్తున్నాడు. మంటల వేడి, షట్టర్ దాకా వ్యాపించేయ్. లోపల శబ్దాలు విన్నాను. షాపు ముందుకు పరిగెత్తేను. షట్టర్‌ను ఎత్తాలని చెయ్యివేసేను. నా అరచేతులు కాలిపోయేయ్. నేను షాపు బయటే ఉండిపోయేను. లోపల మంటలకు రంగారావు బలి అయిపోయేడు. కాదు ... 'అత్యాశ' అనే అగ్నికి అతను బలి అయిపోయేడు. మర్నాడు పోలీసులకు — ఫైర్ స్టేషన్‌కు నేనే ఫోన్ చేసేను. ఆ తర్వాత విషయం మీకు తెలిసిందే. నాకు మీరు ఏ విధమైన శిక్ష విధించినా అనుభవిస్తాను. సిద్ధంగా ఉన్నాను సార్ — చెప్పడం పూర్తిచేసి తలవంచుకున్నాడు ప్రకాష్‌చంద్ర.

వేదవ్యాస్ అక్కడకు వచ్చేడు. 'సార్ ... ఈయన వేలిముద్రలూ ఆ షాపు షట్టర్ మీదున్న వేలిముద్రలతో సరిపోయేయ్' అన్నాడు వేదవ్యాస్. ఇంద్రజిత్ తలవూపేడు.

"శాస్త్రి గారూ ... విన్నారు కదా ... ఈ ప్రకాష్‌చంద్ర రంగారావుకు సహకరించేడు ... అంతే! రంగారావు మరణానికి బాధ్యుడు కాడు. అయినా ఇతన్ని వెంటనే కోర్టుకు అప్పగిస్తాను. ఆ తర్వాత నిర్ణయం కోర్టుదే —!" అన్నాడు క్రైమ్ బ్రాంచ్ ఎస్సై ఇంద్రజిత్.

